# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 28-01-2017**

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఎస్సీ, ఎస్టీల కోసం అనేక కార్యక్రమాలు, పథకాలు అమలు చేసినప్పటికీ ఇంకా ఆ వర్గాలలో పేదరికం పోలేదని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో ఎస్సీ, ఎస్టీలే అత్యంత నిరుపేదరికం అనుభవిస్తున్నారని, వారి అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పని చేయాల్సి వుందన్నారు. రాజకీయాలకతీతంగా తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం అందరం కలిసి ఆలోచించి విధానం రూపొందించుకోవాలని, దీనిని పకడ్బందీగా అమలు చేసుకోవాలని సిఎం పిలుపునిచ్చారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం అనుకున్న విధంగా ముందుకు పోతున్నదని, రాష్ట్ర ప్రగతి కూడా బాగుందని సిఎం వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వృద్ధి రేటు దేశంలోనే అత్యధికంగా వుందని, ఈ ఫలితం రాష్ట్రంలో పేదరికం నిర్మూలన కోసం ఉపయోగపడాలన్నది తమ లక్ష్యమని సిఎం అన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో భోజనం చేసిన ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు, ప్రగతి భవన్ లో వారితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రులు అజ్మీరా చందూలాల్, జగదీష్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు రాజీవ్ శర్మ, జిఆర్. రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.పి.సింగ్, రసమయి బాలకిషన్, పిడమర్తి రవి, నల్లాల ఓదేలు, మల్లు భట్టి విక్రమార్క, గీతారెడ్డి, నంది ఎల్లయ్య, సండ్ర వెంకటవీరయ్య, ఎస్. నిరంజన్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, బాల్కసుమన్, సీతారాం నాయక్, పసునూరి దయాకర్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

“ఏ వయసు వారికి ఏం చేయాలి? వృద్ధులు, యువకులు, విద్యార్థుల కోసం అనుసరించాల్సిన వ్యూహంపై అధ్యయనం చేయాలి. 10-25, 25-50, 50-75 వయస్సుల వారీగా వ్యూహం రూపొందించాలి. బావి తరానికి మంచి విద్య అందించడం ద్వారా వారికి మంచి జీవితం అందించాలి. అందుకోసం రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రారంభిస్తున్నాం. డిగ్రీ రెసిడెన్షియల్స్ ఏర్పాటు చేస్తున్నాం. ఎస్సీ, ఎస్టీ అమ్మాయిల కోసం రెసిడెన్షియల్స్ ఏర్పాటు చేయడంతో పాటు, పట్టణాల్లో ఇతర కోర్సులు చేదివే అమ్మాయిలకు కూడా వసతి కల్పించాలి” అని సిఎం వివరించారు.

“ఎస్సీ, ఎస్టీలకు భూ పంపిణీ కార్యక్రమం ఎప్పటి నుంచి అమలులో వుంది. అయినా అసైన్డ్ భూముల్లో వ్యవసాయం జరగడం లేదు. అవి ఆర్థిక వనరుగా మారలేదు. ఈ పరిస్థితులో మార్పు రావాలి. అసైన్డ్ భూములు ఉపయోగంలోకి రావాలి. ఏ ఊరిలో ఎవరి పేరుపై భూమి వుంది? అది సాగులో వుందా? లేదా? సాగులోకి రావాలంటే ఏం చేయాలి? అనే అంశాలపై ప్రజా ప్రతినిధులు దృష్టి పెట్టాలి” అని సిఎం చెప్పారు.

“ఎస్సీ, ఎస్టీ ప్రజా ప్రతినిధులతో కమిటీ వేసుకుందాం. ఆ కమిటీ ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించుకోవాలి. క్షేత్ర పర్యటన చేయాలి. ఎస్సీ, ఎస్టీ వర్గాల కోసం ఏం చేయాలో వారే నిర్ణయించాలి. అన్ని పార్టీల సభ్యులుండే ఈ కమిటీ సిఫారసులు ప్రభుత్వం అమలు చేస్తుంది” అని సిఎం చెప్పారు.

“వందశాతం ఎస్సీ, ఎస్టీ వర్గాల్లో గుణాత్మకమైన మార్పు రావాలి. నేను చాలా చిత్తశుద్ధితో వున్నాను. మనం తలుచుకుంటే తప్పక ఈ వర్గాల జీవన ప్రమాణాల్లో మార్పు రావాలి. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ తీసుకురావడం ఓ మంచి పరిణామం. తర్వాత రాష్ట్ర విభజన జరిగింది. ఇప్పుడు తెలంగాణ ఏర్పడింది. మంచి ప్రగతిలో వున్నాం. గతం అనవసరం. విమర్శలు, ప్రతి విమర్శలు కాకుండా ఎస్సీ వర్గాలకు నిజంగా ఏం అవసరమో, ప్రభుత్వం ఏమి చేయాలో నిర్ణయించుకోవాలి. ఇప్పుడున్న చట్టాన్ని బలోపేతం చేద్దాం. పారదర్శక వ్యూహం వుండాలి. చిత్తశుద్ధితో అమలు చేయాలి. మేము చాలా చిత్తశుద్ధితో వున్నాం. అంకితభావంతో పని చేసి ఆ వర్గాల్లో మార్పు తెద్దాం. అప్పుడే ప్రజా ప్రతినిధులుగా, అధికారులుగా మనకు సంతృప్తి కలుగుతుంది” అని సిఎం అభిప్రాయపడ్డారు.

“పట్టణ ప్రాంతాల్లో ఉండే ఎస్సీ, ఎస్టీల కోసం ఒక ప్రణాళిక, సెమీ అర్బన్ లో ఉండే ఎస్సీ, ఎస్టీల కోసం ఏం చేయాలి, గ్రామీణ ప్రాంతాల్లో వుండే వారికోసం ఎలాంటి వ్యూహం అనుసరించాలి. అనే విషయంపై ఆలోచించాలి. మూడు ప్రాంతాల్లో నివసించే వారి జీవన స్థితిగతులు వేర్వేరుగా వుంటాయి. కాబట్టి ఈ మూడు ప్రాంతాల వారి కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలి” అని సిఎం సూచించారు.

“దళితులకు మూడెకరాల భూ పంపిణి కార్యక్రమం మంచి ఆలోచనతో అమలు చేస్తున్నాం. ఇది నిరంతర కార్యక్రమం. వ్యవసాయాధారిత కుటుంబానికి కనీసం 3 ఎకరాల భూమి వుంటేనే మంచి ఆర్థిక వనరుగా వుపయోగపడుతుందని భావించాం. భూమి ఇవ్వడమే కాక, కరెంట్, నీళ్లు, ఇతర వసతులు కూడా కల్పిస్తున్నాం. ఇదే విధంగా గతంలో ఇచ్చిన భూమి కూడా ఉపయోగంలోకి రావాలి. కమతాల ఏకీకరణ (Consideration of Lands) జరగాలి. తెలంగాణ రాష్ట్రంలో నీటి పారుదల ప్రాజెక్టులు, మిషన్ కాకతీయ వల్ల సాగునీరు అందుతుంది. కాబట్టి వ్యవసాయం కూడా బాగుపడుతుంది” అని ముఖ్యమంత్రి చెప్పారు. “కేంద్ర

ప్రభుత్వం బడ్జెట్ రూపకల్పనలో మార్పులు చేసింది. ప్రణాళిక, ప్రణాళికేతర పద్దులు కాకుండా, రెవెన్యూ కాపిటల్ పేరుతో బడ్జెట్ చూపించాలని చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వం తప్పక ఈ విధానం అనుసరించాలి. మన రాష్ట్రంలో కూడా బడ్జెట్ రూపకల్పన జరగాలి. కాబట్టి ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ లో మార్పులు రావాలి. మొత్తం బడ్జెట్ లో ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదిక, వారి నిష్పత్తికి అనుగుణంగా నిధులు కేటాయించాలి. వారి జనాభా శాతం కంటే కొంచెం అధికంగానే ఖర్చు పెట్టాలి. ఆయా వర్గాలకు నిధులు కేటాయించడం, ఖర్చు చేయడానికి అవసరమైన విధానం ఎస్సీ, ఎస్టీ కమిటీ రూపొందించాలి. ఎస్సీ, ఎస్టీ వర్గాల్లో పేదరికం పోవాలి. అదే లక్ష్యం కావాలి" అని సిఎం చెప్పారు.

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ ను మరింత పటిష్టంగా అమలు చేసే విషయంపైనా, చేయాల్సిన మార్పు చేర్పులపైనా ప్రతినిధులు సూచనలు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో సబ్ ప్లాన్ పై కార్యాచరణ రూపొందించడానికి ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు చూపిన చొరవను తాము అభినందిస్తున్నట్లు ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి కోసం సిఎం చిత్తశుద్ధితో పని చేస్తున్నారని ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ రూపకల్పనలో పాలుపంచుకున్న ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క, సీనియర్ అధికారి సోమేశ్ కుమార్ అభిప్రాయాలను ఈ సమావేశంలో వెల్లడించారు.

"సాధారణంగా ఎస్సీ, ఎస్టీ వర్గాల కోసం నిధులు కేటాయించడమే కాక, వారి కోసం ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించి, ప్రత్యేక నిధులు ఇవ్వాలి, ఆ నిధులు ఒక ఆర్థిక సంవత్సరంలో ఖర్చు కాకుంటే, వాటిని మరుసటి ఏడాదికి బదలాయించే (Carry Forward) పద్ధతి అవలంభించాలి. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కు రూల్స్ కూడా రూపొందించలేదు. ఈ నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కు సవరణలు చేయాలి. ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి కోసం గ్రోత్ ఇంజిన్ రూపొందించాలి. దీనికి అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ కమిటి ప్రభుత్వానికి సూచనలు చేయాలి" అని సిఎం అభ్యర్థించారు.

"ఎస్సీ, ఎస్టీల కోసం కేటాయించిన నిధులు వేర్వేరు శాఖల ద్వారా కాకుండా ఎస్సీ, ఎస్టీ శాఖల ద్వారానే ఖర్చు చేయాలి. ఈ నిధులు ఎలా ఖర్చు చేయాలి, ఏ కార్యక్రమాలు నిర్వహించాలనే విషయంపై కమిటి సూచనలు చేయాలి. ఈ వర్గాలకు సంబంధించి ఒక ప్రాంతంలో ఒక్కో అవసరం వుంటుంది. దానికి అనుగుణంగా కార్యక్రమాల రూపకల్పన జరగాలి" అని ముఖ్యమంత్రి చెప్పారు.

"ఎస్సీ, ఎస్టీ వర్గాల జీవన ప్రమాణాలను పెంచడానికి రెసిడెన్షియల్ స్కూల్స్ పెట్టడం మంచి నిర్ణయమని టిడిపి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అభినందించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల అభివృద్ధి కోసం ఆలోచిస్తూ ఈ సమావేశం నిర్వహించడం, కూలంకుశంగా చర్చించడం విప్లవాత్మక చర్చ అని కాంగ్రెస్ ఎమ్మెల్యే సంపత్ అన్నారు. దీనికి

ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు బదిలిస్తూ, అప్పుడే ప్రభుత్వాన్ని అభినందించవద్దని, ఎంతో కొంత మార్పు వచ్చాక అభినందించాలని చెప్పారు. ఓ మంచి అడుగు పడిందని అందుకు అభినందనలు అని మల్లు భట్టి విక్రమార్క అన్నారు."

కడియం శ్రీహరి, నంది ఎల్లయ్య, కిశోర్, రెడ్యానాయక్, డా. రాజయ్య, గీతారెడ్డి, సంపత్ తదితరులు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరేందుకు తెలంగాణ అఖిలపక్షంను ఢిల్లికి పంపుతామని సిఎం కేసిఆర్ చెప్పారు.

ఎమ్మెల్యేలు సున్నం రాజయ్య, రవీంద్రకుమార్ ఎస్టీలకు సంబంధించిన సూచనలు చేశారు. ముఖ్యమంత్రి కేసిఆర్ చొరవను అభినందించారు.

"ఇంతకాలం ఎస్సీ, ఎస్టీలకు ఏం కావాలో ఇతరులు నిర్ణయించే వారు. తెలంగాణ రాష్ట్రంలో మార్పు రావాలి. ఎస్సీ, ఎస్టీలకు ఏమి కావాలో ఆ వర్గాల నుంచి వచ్చిన ప్రజా ప్రతినిధులే నిర్ణయించాలి. అందుకే ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన కార్యక్రమాలు ప్రజాప్రతినిధులతో చేసిన కమిటీయే రూపొందిస్తుంది. ప్రభుత్వం దీనిని అమలు చేస్తుంది" అని సిఎం కేసిఆర్ చెప్పారు.

ఎస్టీ కమిటీ:
అధ్యక్షులు: మంత్రి చందులాల్
సభ్యులు: డి.ఎస్. రెడ్యానాయక్, సీతారాం నాయక్, నగేష్, రాము నాయక్, కోవ లక్ష్మి, సున్నం రాజయ్య, తాటి వెంకటేశ్వర్లు.

ఎస్సీ కమిటీ:
అధ్యక్షులు: కడియం శ్రీహరి
సభ్యులు: నంది ఎల్లయ్య, బాల్కసుమన్, ఎం.ఎస్. ప్రభాకర్, సండ్ర వెంకటవీరయ్య, భట్టి విక్రమార్క, గీతారెడ్డి, సంపత్ కుమార్, నల్లాల ఓదేలు, రసమయి బాలకిషన్, ఆరూరి రమేష్, కిశోర్, సంజీవ రావు
స్పెషల్ ఇన్వయిటీ: కొప్పుల ఈశ్వర్.

**సిపిఆర్ఓ టు సిఎం**